# 12. సేజ్జెగాడు

"నీ కోసం ఎంకయ్య కాపు మూడుసార్లు వచ్చి తిరిగి పోయాడయ్యా. మళ్లీ వస్తానన్నాడు. నిన్ను ఎక్కడికీ పోకుండా ఇంటికాడ ఉండమన్నాడు" పొద్దుపోయి ఇంటికి వచ్చిన ఏహోషువాతో అంది భార్య రూతమ్మ.

"ఈ జామున ఎక్కడికి పోతానుగానీ ఆయన ఎన్నిసార్లు వచ్చినా ఇయ్యాల పోయినకాడ ఉందే. ఇంకొకరికి పోటానికి వల్లకాదు"

"నన్ను అయినా చెప్పమని బతిమలాడి పోయాడయ్యా! ఇంతమట్టుకి ఆయన ఒక్క ఎకరం కూడా ఎదపెట్టుకోలేదంట. మూడు పూటలా బువ్వపెట్టి ఎంత కూలీ కావాలంటే అంత కూలి ఇస్తానన్నాడు. సందకాడ వచ్చేటప్పుడు మేతమోపు కూడా కట్టకొచ్చుకోమన్నాడు"

"నిజమేనే! చేసేపని మానుకుని మజ్జెలో ఎట్టపోయేది? పక్కన ఇంకొకరికి వప్పుకుని పోతన్నా గదా!"

"బిడ్డకు పెళ్ళి చేసుకుంటున్నామంటే రెండేలు రొక్కమిచ్చాడు. వడ్డీ లెక్కగట్టి తీసుకుంటాడనుకో. అయినా అవసరానికి ఆదుకున్నాడు కదా! ఇయ్యాల నువ్వు అరక్కిపోయిన నరసయ్యని అడిగితే ససేమిరా కాదన్నాడు. కాళ్లాయేళ్లా పడినా కాణీ ఇయ్యలా. ఏందీ ముకమాటం... ఎగ్గొట్టి ఎంకయ్యకాపుకి పోక!"

"ఛ... వాళ్లు గడ్డి తిన్నారని మనం గడ్డితింటామా? మాటబోయిద్ది. వారం రోజులు ముందుగా వచ్చివుంటే ఎంకయ్యకాపుకే పోకపోయానా? ఇప్పుడు ఇరుక్కున్న తరవాత ఎట్ట?"

"ఏం కాదులే. రోజూ ఆయనకే పోవాలని శాసనం ఉందా? మనకి అవసరానికి సాయపడి నోడికి మనం సాయపడాలి కానీ మాట పట్టుకుని యేలాడబడితే ఎట్ట?"

"సర్లేవే. మజ్జెలో మానుకునిపోతే కంతిరోడు అంటారు. రెండోసారి పిలవరు. మడిసికి విలువుండదు. ఇంతకీ నీళ్లు కాగబెట్టావా?"

"నాకూ సొలిపోయి పడుకున్నా. ఎంసేపూ... ఇప్పుడే కాగబెడతా ఉండు" అని లోపల గుంజని ఆనుకుని కూర్చున్న రూతమ్మ లేచి, గుడిసె బయటఉన్న పొయ్యి దగ్గరికి వచ్చింది.

ఎహోషువా నులక మంచం వాల్చుకుని పడుకున్నాడు.

మట్టికుండ పొయ్యిమీద ఉంటే పుల్లలు పెట్టి మంట రాజేసింది.

"ఒరేయ్ ఎహోషువా... రేయ్..." వీధిలో నించే కేకలు పెట్టుకుంటూ వచ్చాడు శేషయ్య.

ఎహోషువా కనపడక పోవడంతో బయటఉన్న రూతమ్మని చూసి "ఏమేయ్ రూతూ... ఎటుపోయాడే ఈడూ?" అడిగాడు శేషయ్య.

రూతమ్మ సమాధానం చెప్పేలోపే బయటకి వచ్చాడు ఎహోషువా.

"ఏరా ఎహోషువా... అరక్కి రెండు రోజులు రావాల్రా! మా పెజ్జీతగాడికి రోగం వచ్చి మూల పడ్డాడు. అరక కట్టేవాడులేక నిన్నా ఇయ్యాలా ఎద్దులు గాటి దగ్గరే ఉన్నాయ్యి. చేలు బీళ్లు అయిపోయినయ్యి. అదునుపోతంది. రెండు రోజులు రారా నీకు పుణ్ణెముండిద్ది"

"నరసయ్యోళ్ల పనికి పోతన్నాను కాపా. వాళ్ల పొలం యిత్తనాలు ఎదపెడతన్నాం. రాటానికి వల్లకాదు"

"ఒరేయ్... నీకు పుల్లలు కావాలంటే పుల్లలు ఇస్తా. మేత కావాలంటే మేత మోపు ఇస్తా. నీకు ఏది కావాలంటే అది ఇస్తా రెండురోజులు అరక్కి వచ్చావంటే..."

"నువ్వు ఇయ్యవని కాదు కాపా. ఇంతకు ముందు ఎన్నిసార్లు తెచ్చుకోలేదూ మీ వాముల దగ్గర మేత మోపులూ, పుల్లల మోపులూ! పక్కన పోతన్నా కదా!"

"ఎట్రా?"

"ఇంక ఎవుర్నన్నా ఎతుకులాడుకో కాపా"

"ఎవుర్నన్నా పిలవలేకనా నీ కోసం వచ్చింది? ఉంటానికి చాలామంది ఉన్నా ఏం లాభంరా! అసనాటోడు తప్ప నీమాదిరిగా సేజ్యం చేసేవోడు లేడని కదరా నీ కోసం వచ్చింది."

"అసనాటోడో కొసనాటోడో... ఎట్టోకట్ట... అదునులో పనికావాలి కద కాపా. వంకరగానో టింకరగానో దుంతాండు కదా!"

"వాళ్ళ చేత అరక దున్నిచ్చటం కంటే ఎద్దుల్ని గాట్లో కట్టేసుకుని మేపుకోవటం మేలు. నువ్వు వస్తావని ఆశపడి వచ్చాను కదరా!" అంటూ నిరాశగా వెళ్ళిపోయాడు శేషయ్య.

ఎహోషువా మనసు ఆనందంతో ఉప్పొంగిపోయింది.

"చూసావంటే నేనంటే... ఇంటి చుట్టూ ఎంతమంది తిరిగి పోతన్నారో. చుట్టుపక్కల ఆమడ దూరంలో నా మాదిరిగా సేజ్యం చేసేవోడు లేడు తెలుసా?" బడాయిగా భార్యతో అన్నాడు.

"సాల్లే... మింగటానికి మెతుకు లేకపోయినా ఎచ్చులికి కొదవలేదు. నువ్వు మంచి సేజ్యగాడివని అందరి కంటే నీకు ఒక రూపాయి కూలి ఎక్కువేమన్నా ఇస్తన్నారా... నీకేమన్నా ఎక్కువ వరగబెడతన్నారా?"

"నీకు తెల్సింది అదేనే. గుర్రం గాడిద ఒకటేనంటే? పనోడికీ కానోడికీ ఏం తేడా లేదన్నమాట! ఫలానా ఎహోషువా అంటే ఏ రైతు అయినా కలవరిస్తాడు. ఎవురికి పనిలేకపోయినా నాకు పనికేం కొదవుండదు. ఎంత కొమ్ములు తిరిగిన ఎద్దు అయినా నేను ముల్లుగర్ర తీసుకుంటే నాగసారం వూత్తే నాగుబాము ఆడినట్టు సాల్లో ముచ్చటగా పోవాల్సిందే!"

"నీళ్లు కాగినయ్యి లేచి పోసుకో. పనోడంట పనోడు! ఇంటి మీద కప్పులేచిపోయి ఏడాది అయింది. ఎండకి గుడిసేకానీ వానొస్తే లోపల అయినా ఒకటే బయట అయిన ఒకటే! నిలవ నీడలేదు. ఎవురో ఒకరి పనికి పోతా నమ్మబలుక్కుని మంచి ఇల్లు యేసుకుందామని లేదు. పనేకాదు తెలివి కూడా ఉండాల"

"అయితే నాకు తెలివి లేదన్నమాట! ఇంట గెలిచి రచ్చగెలవమన్నారు. నేను రచ్చ గెలిచినా ఇంటో నీతో గెలవలేకపోయానే! యీదిలో వుండ యిలువ ఇంటో లేకపాయె! కప్పు యేసుకోవాలంటే మాటలు కాదే.డబ్బుతో కూడుకున్న పని!"

"ఏందిరో ఎహోషుగో...కోతలు కోస్తన్నావు. పనోడివంటే నువ్వురా!" వీధిలో నించే పెద్దగా అంటూ వచ్చాడు ఎంకయ్య.

"ఏం కాపా:..." బయట కుక్కి మంచం మీద కూర్చున్నవాడు రక్కున లేచి అన్నాడు ఎహోషువా.

"ఊరంతా మాటు మణిగింది. నువ్వు నీళ్లు కూడా పోసుకోకపోతివి! ఏకువ జామునలేచి అరక్కి ఏం పోతావురా ఇంక?"

"అలవాటేలే కాపా"

"నీ కోసం నాలుగుసార్లు తిరిగిపోయారా. గవరినేరుక్కూడా వుండదురా నీ దిమేందు చూడబోతే..."

"దా కాపా... కూసో..." గుడిసె లోపలికిపోయి ముక్కాలిపీట తీసుకొచ్చి వేసి అంది రూతమ్మ.

"ఏం కూసోమంటావే? ఇప్పటి దాకా కూసునే వచ్చా. సరే రేపు అరక్కి రావాల్రా. ఇంతమట్టుకి ఒక్క చేను కూడా పైరుయెయ్యలా. అదును పోతంది."

"పక్కన వప్పుకుని పోతన్నా గద కాపా" నసుగుతూ అన్నాడు ఎహోషువా.

"నాకు అయ్యేం తెలియదురా. మడిసి దొరకలా. అదునులో పైరు యేసుకోకపోతే ఎందుకు ఇంక? అవసరానికి ఉపయోగపడతావనే కదరా బిడ్డకి పెళ్లి చేసుకుంటాసంటే డబ్బు సర్దింది"

"నేను ఆ మాటే చెపతన్నా. ఎంకయ్య మామని అయితే సొతంత్రంగా ఏం కావాలంటే అది అడగొచ్చూ, తెచ్చుకోవచ్చూ! నువ్వు అయితే అవసరానికి అక్కరకొచ్చే మడిసివి మామా!"

"సరే. రేపు వాళ్లకి పోయి ఇంకరానని చెప్పి, ఎల్లుండి నించీ మీ పనిలోనే ఉంటాలే కాపా"

"చేతిలో యిత్తుకీ జద్దిగంలో యిత్తుకీ పంటలో తేడా వచ్చిద్దంట! పైరుకి ముదురూ పసరానికి లేతా అన్నారు. అదునులో ఒకరోజు అంటే మాటలు కాదు గదరా. సరే కానీయి అయితే... ఎల్లుండి నించీ ఇంక మన పనిలోనే వుండాల్రేయ్"

"మీ పనిలో వుండక ఎక్కడికి పోతాన్లే మామా. సరే మామా... ఇంటి కప్పులేచి పోయింది. తాటాకో, గోక్కట్టో ఏదో చూసి పెట్టు మామా. వానపడితే ఇల్లు ఎల్లవ అవతంది. చెరువే! ఈ మడిసేమో ఇల్లూవాకిలీ పట్టిచ్చుకునే రకం కాదు. ఏకువ జామున లేచి అరక్కిపోతే ఇక ఏ అర్ధరేతిరికో వస్తాడు"

"ఇప్పుడికిప్పుడు నీకు కప్పు ఎక్కడ దొరికిద్దే? మొన్ననే ఎవురో తాటాకు అడిగి కొట్టుకునిపోయారు. సరే చూద్దాం లేవే ఏదో, ఉంటానికి కొంప లేకపోతే ఎట్ట?"

"మేం మొగుడూ పెళ్ళాలము ఎల్లకాలం చాకిరీ చేసినా కుండ మాడతందీ కడుపు నిండుతంది కానీ నాలుగురూకలు ఎనకేసు కోకపోతిమీ!"

"దీనికి ఎప్పుడూ రంధి డబ్బు మీదనే కాపా. కూలి మీద ఏం వేలు యెనకేస్తాం! అప్పటికీ ఇద్దరు బిడ్డలకి ఉన్నంతలోనే మంచి మనువులు చూసి

లగ్గాలు చేసాం కదా. అసలు ఈ కాలంలో ఆడబిడ్డలకి పెళ్ళిళ్ళు చేయాలంటే మాటలా?"

"మాటలకేంలే. తెగవు... నేను వస్తారా. ఎల్లుండి నించీ రారేయ్ పనికీ..." అంటూ వెంకయ్య వెళ్ళిపోయాడు.

"గత్తర పనులు అయిన తరవాత కొంప ఎవారం చూడు. వానలు పడితే వుండాతికాదు" అంది రూతమ్మ.

ఆమె మాటలు వింటూ స్నానానికి వెళ్ళాడు ఎహోషువా.

* * *

రూతమ్మ, ఎహోషువా దంపతులకి ఇద్దరు కూతుళ్ళు. కొడుకులు లేరు. ఇద్దరికీ పెళ్ళిళ్లు చేశారు. బాదరబందీల్లేవు.

వాళ్ళకి స్వంత ఆస్తి ఏం లేదు. రెక్కల కష్టమే ఆధారం.

ఎహోషువా అంత మంచి సేద్యగాడు ఎవరూ లేరని ఊళ్ళో పేరు. పని ఉంటే నిద్రాహారాలు ఉండవు. ఎద్దులు అంటే చాలా ఇష్టం.

ఊళ్ళో ఎవరు కొత్త ఎద్దులు కొనుక్కువచ్చినా, పని మానుకుని వెళ్ళి చూసి, మంచి చెడ్డలూ, వాటి సుడులూ, లాగుడూ, అందం అన్నీ మాట్లాడి వస్తాడు. ఊరి మొత్తం మీద ఎద్దులు, దున్నలు, కోడెదూడలు 160 కాడులు ఉన్నాయి

* * *

మరుసటి రోజు నరసయ్య పనికి వెళ్లిన ఎహోషువా ఇంక వాళ్ల పనికి రానని చెప్పి, తరువాత రోజు నించీ వెంకయ్య పనికి వెళ్ళడం మొదలుపెట్టాడు.

రైతులూ, అరకలు తోలే సేద్యగాళ్ళూ సమయ సందర్భాల్లో ఎహోషువాలాంటి సేద్యగాడు లేడని చెప్పుకుంటున్నారు. వాళ్ళ మాటలకి అతని గుండె ఉప్పొంగిపోతోంది. వాళ్ళ పూరిగుడిసె అలాగే ఉంది. వాళ్ళ పేదరికం, దరిద్రం, నిరంతరం చాకిరీ అలాగే ఉన్నాయి.

కాలం దొర్లిపోతుండగా ఎహోషువా నిరంతర చాకిరికి కూడా అంతరం, ఆటంకం ఏర్పడిన కాలం వచ్చింది.

అప్పటికే ఊళ్ళో రెండు ట్రాక్టర్లు ఉన్నాయి.

కొత్తగా వెలిసిన బ్యాంకులు ట్రాక్టర్ల కోసం రైతులకి లోన్లు ఇవ్వడం ముమ్మరం చేయడంతో చాలామంది రైతులు ట్రాక్టర్లు కొనుక్కుంటున్నారు.

"ఒరేయ్ ఎహోషుగా... ఎద్దులతో ఇక లాభం లేదురా. వాటి ముకాన మేత కోసుకురావటానికి ఒక మడిసి కావాలి. వాటికి నీళ్ళూ నిప్పులూ తెచ్చి సముదాయిచ్చుకోడానికి ఇంకో మడిసి కావాలి. అటు చేరీ ఇటు చేరీ వాటి కోసం ఇద్దరు ముగ్గురు మడుసులు చెడిపోతున్నార్రా! ఎద్దులకి పని ఉన్నా

లేకున్నా వాటితో జత మడుసులకి పని ఉంటానే ఉండిద్ది. ఎద్దులు అమ్మి ట్రాక్టరు తెస్తారా. పనిలేకపోతే దాని పాటికి అది మూలనపడి ఉండిద్ది. దానికి మేత వేయాలీ, నీళ్ళు తేవాలీ, దాణా పెట్టాలీ, పేడకళ్లు తీయాలీ అనే చింత లేదు. ఇంటో సొంతంగా చేసే సంతన కూడా లేదు. ఎందుకు ఇంక ఎద్దులు?" ఎద్దులు అమ్మి ట్రాక్టరు తెచ్చే ప్రయత్నంలో ఉన్న వెంకయ్య అన్నాడు ఒకరోజు ఎహోషువాతో.

"ఎద్దులతో సాటి అయిద్దంట కాపా టాక్టరు. ఎద్లు ఉంటే ఎంత కళకళ! ఎంత అందం చందం! ఎంతగొప్ప! ఎద్దుల మువ్వల గంటల గణగణలతో ఎంత సందడి సందడిగా ఉండిద్ది? పేణం ఉన్న ఎద్దులూ పేణం లేని టాక్టరూ ఒకటేనా కాపా?"

"పేణం ఉన్న వాటికంటే పేణంలేని వాటితోనే సుఖం రా! చీకూ చింతా ఉండదు. ఎద్దుల మేతకి ఎంత ఖర్చవతందీ? పని ఉన్నా లేకున్నా వాటికి మేత తప్పదాయె! లెక్క చూసుకుంటే ఎద్దుల సేద్యం అందదురా, ఎనకటి రోజుల్లో ఎట్ట చేసారో కానీ..."

"ఎద్దులు గాట్లో ఉంటేనే గాదెలు నిండిపోతాయంటారు కద కాపా! ఎద్దులకి మనం వేసే మేత చూసావు కానీ వాటి పేడ చాలు బంగారం పంటలు పండటానికి! వాటి పేడ ఎంతో సత్తవ కద కాపా! మనకి ఎంత నయ్యి దిబ్బ తేలిద్ది? బస్తాల ఎరువులు యేస్తే ఏమొస్తన్నయి... పురుగులు వస్తన్నయి, తెగుళ్ళు వస్తన్నయి, ఖర్చులు ఎక్కువ అవతన్నయి, చివరికి దిగుబళ్ళూ రావడంలా?"

"అయన్నీ చూసుకుంటే లాభం లేదురా. ముందు సుఖం చూసుకోవాలి!"

"నువ్వు ఎద్దులు అమ్మాలనుకోవడం నాకేం నచ్చలేదు కాపా!"

"నీ ముకం నీకు తెలియదు పోరా! కాలంతో మారకుండా ఎప్పుడో ఎనకటి రోజుల్లో ఉంటే ఎట్ల?" అన్నాడు వెంకయ్య

అనుకున్నట్లే పొలంలో పైర్లు వేసి, సేద్యాలు అయిపోయిన వెంటనే ఎద్దులు అమ్మేశాడు వెంకయ్య.

ఆయన ఒక్కడే కాదు, పెద్ద రైతులు చాలా మంది ఎద్దులతో సేద్యం అందుబాటు కావడంలేదని వాటిని అమ్మిట్రాక్టర్లు కొనుక్కున్నారు. ట్రాక్టర్లతో బాడిగలు చేయించుకోవడం మంచిదనే ఉద్దేశంతో చిన్న, సన్నకారు రైతులు కూడా ఎద్దులు అమ్ముకున్నారు.

బాగా ఆసక్తి, అభిమానం కలిగిన ఇద్దరు ముగ్గురు రైతులకి మాత్రమే చివరికి ఎద్దులు మిగిలాయి. దున్నపోతు అరకలు అనేవి అసలు ఆనవాలు లేవు. ఎప్పుడైతే ఎద్దులూ, నాగళ్ళూ లేకుండా పోయాయో ఎహోషువాని పిలిచే వాళ్ళు కూడా లేకుండా పోయారు.

పనిలోనూ, సేద్యంలోనూ, రైతుల అభిమానంలోనూ ఒక వెలుగు వెలిగిన ఏహోషువాకి చీకట్లు ముసురుకోవడం మొదలుపెట్టాయి.

చేసే చేతులూ, అరక వెంట తిరిగే కాళ్ళూ, పని లేకపోవడంతో చచ్చుబడినట్లు అయ్యాయి.

అరక పనీ, ఎద్దుల పనీ, పొలంలో పనీ తప్ప మరో పని చేతకాదు. మట్టి పనికో, తట్ట పనికో వెళ్దామనుకున్నా వాటికి కూడా పిలిచే వాళ్ళు లేకుండా పోయారు.

"నేను సొంతంగా ఎద్దులు కొనుక్కుని బాడిగలు చేస్తాను కాపా. ట్రాక్టరు వాళ్ళకి కాకుండా నాకు చెప్పండి కాపా పని" అని తను ఎప్పుడూ అరక్కి వెళ్లే ఇద్దరు ముగ్గురు రైతుల్ని అడిగాడు ఏహోషువా.

"అరకలు లాభం లేదురా. నువ్వు రోజంతా దున్నితే రెండు ఎకరాలు దుంతావు ఏమో! అదే ట్రాక్టరయితే గంటలో అయిపోయిద్ది. మనం ఎంత లోతుగా కావాలంటే అంత లోతుగా దున్నుకోవచ్చు ట్రాక్టరుతో" అన్నారు వాళ్లు.

ఏహోషువాకి ఏం చేయాలో, ఎలా బతకాలో అర్థం గాకుండా పోయింది.

అంతకు ముందు అతన్ని అభిమానించే రైతులు కూడా పెద్దగా పట్టించుకోవడం లేదు. చివరికి తిండికి కూడా జరగని పరిస్థితి ఏర్పడింది.

రూతమ్మ నాట్లకో, కలుపులకో వెళ్లి కూలి చేసుకుని వస్తే తినడం, లేకుంటే పస్తువుండటం! ఆమెకి కూడా కలుపులూ, నాట్లు సమయంలో తప్ప విడి రోజుల్లో పనిలేదు.

తిండికి కూడా నకనకలాడుతున్నారు.

పల్లెలో మూడొంతుల జనం పనుల కోసం పట్టణాలకు వలసలు పోతున్నారు.

"మనం కూడా పట్నం పోదామయ్యా! ఇక్కడ ఈగలు తోలుకుంటా ఒకరి ఎదురుగా ఒకరం కూర్చుని ఏం చేద్దాం? పట్నంలో రోడ్లపనో, ఇళ్లపనో, ఇటికలు మోసే పనో ఏదో ఒకటి దొరక్కపోదు. పనీపాటా లేకుండా ఎందుకు ఇంక ఈ ఊళ్ళో" అంది రూతమ్మ భర్తతో.

"పోవటమే మంచిది. ముందు ముందు కూడా ఇక్కడ మనం చేయడానికి పనేం ఉండదు. ఇంకా గడ్డుకాలం వచ్చిద్ది. పట్నం పోతే ఎట్టోకట్ట ఏదో ఒక పని చేసుకుని బతకొచ్చు" అన్నాడు ఏహోషువా.

తరువాత వారం రోజులకి భార్యాభర్తలు ఇద్దరూ మూటాముల్లె, తట్టాబుట్టా సర్దుకుని పట్నం బాట పట్టారు.

విపుల – మాసపత్రిక, ఆగష్టు,2005